

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పోలీసు పరిపాలనలోని నైపుణ్యాలను మెరుగుపర్చుకునేలా శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో ఇటీవల గ్రూపు-4 ఫలితాల్లో పోలీసు శాఖలో జూనియర్ అసిస్టెంట్లకు 6 వారాల బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్ నిర్వహించగా వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. పోలీసు శాఖలో పరిపాలనా విభాగం కీలకమైందని, మీరు సాంకేతిక పరిజ్ఞానం నూతన విధానాలను అవలంబించి నిష్పాక్షికంగా పనిచేయాలన్నారు. పోలీసు శాఖలో సేవలందించేందుకు నైతిక విలువలు, క్రమశిక్షణ, సమర్థత ముఖ్యమని, సిబ్బందికి అందుబాటులో ఉండేలా సేవలందించేందుకు కృషి చేయాలన్నారు. సిబ్బంది తమ ఆరోగ్యాలపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేసే విధంగా అలవాటు చేసుకోవాలని సూచించారు. ట్రైనీలు తమకు కలిగిన సందేహాలను అధికారులతో చర్చించి పోలీసు పరిపాలనలోని నైపుణ్యాలను మెరుగుపర్చుకునేలా శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ హన్మంతరావు, ఆర్‌టీవీఆర్ఆర్ డీఎస్పీ భాస్కర్, వికారాబాద్ ఏఆర్ డీఎస్పీ వీరేశ్, బి-సెక్షన్ సూపరింటెండెంట్ మోహనప్ప, పే సెక్షన్ సూపరింటెండెంట్ మీర్జాజావిద్ బేగ్, ఆర్ఐ డేవిడ్ విజయ్, ఆర్ఎస్ఐ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు
యాద్గార్‌పల్లి విద్యార్థులు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, టీచర్లు

కీసర, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు కీసర మండలం యాద్గార్‌పల్లికి విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు వికారాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో మేడ్చల్ జిల్లా నుంచి యాద్గార్‌పల్లి జడ్పీ పాఠశాల విద్యార్థులు పుట్ట కృష్ణశ్రీ, కందుల సాయిచరణ్ పాల్గొన్ని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయురాలు పుష్పకళ, ఉపాధ్యాయులు పీఈటీ తిరుమల్‌రెడ్డి తదితరులు విద్యార్థులను అభినందించారు.



విదేశాల్లో చదువుకోవాలనే ఆశ విద్యార్థులకు ఉంటుంది. ప్రతిభ ఉన్నా పేదరికం అడ్డుగా మారడంతో చాలామంది విదేశీ విద్యకు దూరమవుతున్నారు. అలాంటి వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. అంబేడ్కర్ ఓవర్సీస్ ఇండియా నిధి పథకం ద్వారా విదేశీ విద్యకు ప్రోత్సాహం అందిస్తోంది. విదేశాల్లో సీటు సాధిస్తే చాలు రూ.20లక్షల రుణం ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. ఇప్పటికే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని చాలామంది విద్యార్థులు ఈ పథకం కింద సాయం పొంది విదేశాల్లో విద్యనభ్యసిస్తున్నారు. ఈ ఏడాది కూడా మరికొందరు రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారు.

విదేశీ విద్యకు
ప్రోత్సాహం!

అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా ఆర్థిక సాయం

- రాష్ట్రంలోనే అగ్రస్థానంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా
- మేడ్చల్ జిల్లాలో గతేడాది 29, ఈ ఏడాది 25 మందికి చాన్స్
- విదేశాల్లో సీటు వస్తేచాలు రూ.20 లక్షల రుణం
- అధికంగా దరఖాస్తు చేసుకుంటున్న ఎస్సీ విద్యార్థులు

మేడ్చల్/వికారాబాద్ ప్రతినిధులు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా విదేశాల్లో చదువుకునేందుకు ఎస్సీ విద్యార్థులు మక్కువ చూపుతున్నారు. షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులు విదేశాల్లో ఉన్నత చదువులు చదివేందుకు తెలంగాణ ప్రభుత్వం 2015 నుంచి అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తోంది. రాష్ట్రంలో డిగ్రీ పూర్తిచేసిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు విదేశీ యూనివర్సిటీల్లో సీట్ వస్తే చాలు ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుంది. దీంతో విద్యానిధి పథకానికి జిల్లా ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. మొదట్లో ఒక్కో విద్యార్థికి రూ.10 లక్షలు అందించేవారు. అవి సరిపోక అప్పులు చేయాల్సి వస్తుందని విదేశాల్లో చదివేందుకు ఎస్సీ విద్యార్థులు ముందుకు రాలేదు. ఈ పరిస్థితిని గమనించిన ప్రభుత్వం మళ్లీ పథకం నిబంధనలు సడలించి సాయాన్ని రూ.20 లక్షలకు పెంచింది. దీంతో రాష్ట్రానికి చెందిన ఎస్సీ విద్యార్థులు విదేశీ విద్యకోసం వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు.

రంగారెడ్డి జిల్లాలో...

రంగారెడ్డి జిల్లాలో 2023-24 సంవత్సరంలో 28 మంది విద్యార్థులకు

మిగతా 7వ పేజీలో...

అర్హతలు..


ఈ పథకం ద్వారా ఆర్థిక సాయం పొందాలనుకునే విద్యార్థులు జీఆర్ఈ, టోఫెల్ వంటి ఎంట్రెన్స్ పరీక్షల్లో కనీసం 60శాతంతో ఉత్తీర్ణత సాధించాలి. విదేశాలకు చెందిన యూనివర్సిటీల నుంచి అడ్మిషన్ పొంది ఉండాలి. వార్షిక ఆదాయం రూ.5లక్షల లోపే ఉండాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిని రాష్ట్ర, జిల్లా స్థాయిలో విచారణ జరిపి మెరిట్ ఆధారంగా అర్హులను ఎంపిక చేస్తారు.

ఏడాదిలో రెండు విడతల్లో ఎంపిక



పేద విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రూ.20 లక్షలు ఆర్థిక సాయం అందిస్తుంది. గత ఏడాది రంగారెడ్డి జిల్లాలో 12 మంది విద్యార్థులకు రూ. 3.40 కోట్లు సాయం చేయడం జరిగింది. ఈ సారి 10 మంది విద్యార్థులను ఎంపిక చేశాం. రూ.1.72 కోట్లు మంజూరయ్యాయి. ఏటా రెండు విడతల్లో ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తున్నాం.

రామారావు, షెడ్యూల్డ్ కులాల రంగారెడ్డి జిల్లా అభివృద్ధి అధికారి



సేవా రంగాల్లో మహిళా సంఘాల పాత్ర కీలకం

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా రంగాల్లో మహిళా సంఘాల పాత్ర ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల బలోపేతానికి సీఆర్పీల వ్యూహంపై జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. దోమ, వికారాబాద్, ధారూర్, మర్పల్లి, మోమిన్‌పేట మండలాల్లో పలు జిల్లాల సీఆర్పీలు రెండు వారాల పాటు గ్రామాలను సందర్శించి శిక్షణ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పేదరిక నిర్మూలనే సెర్ప్ లక్ష్యం అని, సంఘాలు తమ కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చుకుంటూనే సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. బాల్య వివాహాలు, విద్య, ఆరోగ్యం తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పొదుపు సంఘాలు బ్యాంక్‌ల నుంచి పొందిన రుణాలను సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇనాక్టివ్‌గా ఉన్న సంఘాలను పునరుద్ధరించేలా అధికారులు, సంఘాల నాయకులు కృషిచేయాలని తెలిపారు. మహిళలు అవసరమైన రంగాల్లో తమ నైపుణ్యాన్ని మెరుగుపర్చుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఆసక్తి ఉన్న మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశాలు నిర్వహించుకొని పొదుపు, స్త్రీ నిధి, బ్యాంక్ లింకేజీ రుణాలు, బ్యాంకులకు చెల్లించిన అప్పుల వివరాలు నమోదు చేసుకుంటూ పుస్తక నిర్వహణను చేపట్టాలన్నారు. రుణాలు పొందిన మహిళా సంఘాలు సకాలంలో రుణాలు చెల్లింపుల్లో వైఫల్యం చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతలు తీసుకొని స్వయం సహాయ సంఘాలు, గ్రామ సంఘాలు సమావేశాలు నిర్వహించుకుని కార్యాచరణతో ముందుకు వెళ్లేలా పనిచేయాలని తెలిపారు. సమీక్ష సమావేశం సందర్భంగా వివిధ జిల్లాల నుంచి ప్రాతినిధ్యం వహించి గ్రామాల్లో సంఘాల బలోపేతానికి సంబంధించి సూచించిన విషయాలను కలెక్టర్‌కు సీఆర్పీలు నివేదికలతో వివరించారు. సమీక్ష సమావేశంలో డీఆర్డీవో శ్రీనివాస్, అదనపు ఆర్డీవో సరోజ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు అలివేలు, డీపీఎం వీరయ్య పాల్గొన్నారు.

చరిత్రను చాటుతూ నేటికీ చెక్కు చెదరకుండా దర్శనమిస్తున్నాయి కొన్ని పురాతన కట్టడాలు. నిజాం కాలంలో నిర్మించిన కట్టడాలు మేడ్చల్ ప్రాంతానికి చిహ్నంగా నిలిచాయి. ఆ చారిత్రాత్మక కట్టడాలను ఎవరూ పట్టించుకునే వారు లేనప్పటికీ స్థానికులు మాత్రం తమ పూర్వీకులు వదిలి వెళ్లిన ఆస్తులుగా భావిస్తుండడం విశేషం. వందల ఏళ్లు గడుస్తున్నా.. నేటికీ ఆ నిర్మాణాలు దృఢంగా దర్శనమిస్తున్నాయి. నవాబుల కాలంలో ఆలయాలు, మసీదులు, గ్రామ రక్షణ కోసం ఏర్పాటు చేసిన బురుజులతో పాటు, వంతెనలు, వాగులు ప్రత్యేకంగా నిర్మించారు. ఇందులో ఆలయాలు, మసీదులు, బుర్జులు చెక్కు చెదరకుండా కనబడుతున్నాయి.

బండమాదారంలో బురుజు



Sunday Special

చరిత్రకు నిలువెత్తు సాక్ష్యాలు


నూతన్‌కల్‌లో ఉన్న బురుజు

- వందల ఏళ్ల క్రితం నిర్మాణం
- నేటికీ చెక్కుచెదరకుండా దర్శనం
- మేడ్చల్ రామలింగేశ్వరస్వామి ఆలయం
- కొత్తదనంతో దర్శనమిస్తున్న ఖుతుబ్‌షాహీ మసీదు, బురుజులు
- పూర్వీకుల ఆనవాళ్లను కాపాడుతున్న ప్రజలు

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 22: మేడ్చల్ పట్టణంలోని శ్రీరామలింగేశ్వర స్వామివారి ఆలయానికి నాలుగు వందల సంవత్సరాల చరిత్ర ఉంది. నిజాం కాలంలో మేడ్చల్ జాగీర్దార్‌గా ఉన్న దాత్రిక రాజలింగం కలలో రామలింగేశ్వరుడు దర్శనమిచ్చి తనకో ఆలయం నిర్మించాలని కోరగా మేడ్చల్ గ్రామ శివార్లలోని గుట్టల్లో ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయ కీర్తి పెరిగి చివరికి గ్రామ కులదైవంగా మారింది. రాతి శిలల మధ్య ఆలయాన్ని నిర్మించడం విశేషం. ఆనాటి నుంచి నేటి వరకు ఆలయానికి ధర్మకర్తలుగా దాత్రిక వంశీయులు వ్యవహరిస్తూ ప్రతీ ఏడాది ఉత్సవాలు నిర్వహిస్తూ తమ పూర్వీకులు నిర్మించిన ఆలయానికి వన్నె తీసుకొస్తున్నారు.

చెక్కుచెదరని ఖుతుబ్‌షాహీ మసీదు

హైదరాబాద్‌లోని గోల్కొండ నవాబులు కులీఖుతుబ్ షా పాలనలో మేడ్చల్ ప్రాంతంలో నిర్మించిన ఖుతుబ్ షాహీ(పెద్ద మసీదు)కు ప్రత్యేకతను కనబరుస్తోంది. మసీదు నిర్మాణం

మిగతా 7వ పేజీలో...

తాండూరులో ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

తాండూరు రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తాండూరులో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని జిల్లా సీఐటీయూ ప్రతినిధులు శనివారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి కలిసి వినతిపత్రం ఇచ్చారు. వివిధ పరిశ్రమల నుంచి ప్రతి నెలా రూ.18లక్షల వరకు కార్మికులు ఈఎస్ఐ సబ్‌స్క్రిప్షన్ చెల్లిస్తున్నారన్నారు. ఈఎస్ఐ డిస్పెన్సరీ లేక చికిత్స కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు శరణప్ప, రామకృష్ణా, మహిపాల్,కె. శ్రీనివాస్, అనంతయ్య తదితరులున్నారు.

తెరపైకి విజిలెన్స్ కేసు!

- బల్దియా అధికారుల్లో దడ
- అక్రమాలపై ఫిర్యాదు
- ముగ్గురు ఆఫీసర్లపై వేటు?


తాండూరులో రోడ్డును పరిశీలిస్తున్న విజిలెన్స్ బృందం

8

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు
కీసరగుట్ట ముస్తాబు

- 24 నుంచి ఆరు రోజులు జాతర
- ఏర్పాట్లలో అధికారుల నిమగ్నం
- హాజరుకానున్న ప్రముఖులు

కీసర, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే ప్రముఖ శైవ క్షేత్రంగా భాసిల్లుతున్న కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబౌతుంది. ఆరు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను అంగరంగా వైభవం నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు చర్యలు తీసుకుంటున్నారు. పూజలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు వసతులు కల్పించేందుకు ఉన్నత అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఆలయ నిర్వాహకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు, ఎంపీలకు, ఇతర ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ నెల 24వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు జరిగే మహా శివరాత్రి ఉత్సవాలను అట్టహాసంగా నిర్వహించేందుకు ఇటు ఆలయ నిర్వాహకులు, అటు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామివారి దర్శనం కోసం ఆలయ వెనుక భాగం నుంచి ప్రొటోకాల్ లైన్, ఆలయ దిగువ భాగంలో వీఐపీ పాసుల క్యూలైన్, అదే విధంగా శీఘ్ర దర్శనం, అతి శీఘ్ర దర్శనం, ధర్మ దర్శనం క్యూలైన్లు మొత్తం ఐదు క్యూ లైన్ల ఏర్పాట్లతో దర్శనం కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా ప్రముఖులు వచ్చిన సమయంలో ప్రొటోకాల్ లైన్ వద్ద కిక్కిరిసి, వీఐపీ పాసుల లైన్ వద్ద రద్దీ ఏర్పడి భక్తులకు ఇబ్బంది కలగకుండా చేయడం అధికారుల ముందు ఉన్న సమస్య. ఈ సమస్యను అధిగమిస్తే బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసినట్టేనని ఇది వరకు కీసరగుట్టలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి తెలియజేశారు. అర్హతున్న వారినే ప్రొటోకాల్ లైన్‌లో, వీఐపీ పాసుల లైన్‌లో దర్శనానికి పంపుతామని, ఇది అందరూ తప్పక పాటించాలని బహిరంగంగానే చెప్పారు. దీనిని అమలు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వాహనాల పార్కింగ్ వద్ద కూడా గందరగోళం పరిస్థితి నెలకొంటోంది. ఇష్టానుసారం కారు పాసులు జారీచేయడం వల్ల వేద పాఠశాల వద్ద వాహనాల పార్కింగ్ ఎక్కువై ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ సమస్య నివారణకు పోలీసు అధికారులు వాహనాల పార్కింగ్ విషయంలో సమస్యలు రాకుండా బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆకతాయిల ఆగడాలు ఆరికట్టేందుకు షీ టీమ్స్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం

మిగతా 8వ పేజీలో...


కీసరగుట్టలోని శ్రీ రామలింగేశ్వరుడి మూల విరాట్

నేడు తాండూరు-వికారాబాద్ రోడ్డు పనులకు శంకుస్థాపన

తాండూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):తాండూరు-వికారాబాద్ రోడ్డు పనులకు ఆదివారం శ్రీకారం చుట్టనున్నారు. కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోని వికారాబాద్ రోడ్డుకు రూ.101కోట్లు మంజూరు చేస్తు రాష్ట్రఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నేడు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పెద్దేముల్ మండలం ఖానాపూర్ గేటు వద్ద రోడ్డు పనులను ప్రారంభించనున్నారు. గతంలో ఓ కాంట్రాక్టర్ పనులను చేపట్టి వదిలేశారు. మోడల్‌గా 2 నుంచి 3కిలో మీటర్ల మేర రోడ్డు వేస్తారు. తర్వాత పూర్తి స్థాయిలో పనులు చేస్తారు. రోడ్డు విషయమై ప్రజలు, రాజకీయ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఈ రోడ్డు కోసం ముఖ్యమంత్రి, అసెంబ్లీ స్పీకర్‌తో మాట్లాడి నిధులు సాధించారు.

వైభవంగా పోలెపల్లి ఎల్లమ్మ రథోత్సవం

దుద్యాల, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): మినీ మేడారంగా కొనసాగుతున్న పోలెపల్లి ఎల్లమ్మ జాతర వైభవోపేతంగా కొనసాగుతోంది. రెండో రోజు శనివారం రథోత్సవానికి భక్తులు తరలొచ్చారు. సాయంత్రం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పూలతో అలంకరించిన తేరుపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి ఆలయం చుట్టూ ఐదు ప్రదక్షిణలు చేయించారు. డప్పుల దరువులు, శివసత్తుల పూనకాలతో రథోత్సవం కనులపండువగా జరిగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల భక్తులు అధిక తరలొచ్చారు. పోలెపల్లి ఎల్లమ్మ దేవతను కొడంగల్, పరిగి మున్సిఫ్ కోర్టుల జడ్జీలు శ్రీరామ్, శిల్ప వారి కుటుంబాలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారికి స్వాగతం పలికి పూజలానంతరం తీర్థ ప్రసాదాలందించారు. కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సైలు యాదగిరి, అబ్దుల్ రవూఫ్, జీవీ.సత్యనారాయణ, రవిగౌడ్, పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ రాజేందర్‌రెడ్డి, చైర్మన్ జయరాములు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


రథోత్సవంలో భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తులు

నాణ్యమైన భోజనం అందించాలి


దోమ, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని డీఈవో రేణుకాదేవిఅన్నారు. బొంపల్లి పాఠశాలను శనివారం సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు.











ఉద్యోగం ఏదైనా పనితీరే ప్రామాణికం

● ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): చేస్తున్నఉద్యోగం ఏదైనా..ఉత్తమ పనితీరునే ప్రామాణికంగా తీసుకుంటారని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆబ్కారీ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేకసమావేశంలో హైదరాబాద్, రంగారెడ్డి,, ధూల్‌పేట్, ఎస్‌టీఎఫ్(స్టేట్ టాస్క్‌ఫోర్స్) టీమ్‌లకు ఆయన నగదు రివార్డులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, ఎక్సైజ్‌మంత్రి జూపల్లి కృష్ణారావు డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపాలని ఇచ్చిన ఆదేశాల మేరకు ఎస్‌టీఎఫ్ టీమ్‌లు బాగా పని చేస్తున్నాయన్నారు. ఇదే స్ఫూర్తితో మరింత బాగా పని చేయాలని సూచించారు. నగదు రివార్డులు పొందిన వారిలో స్టేట్‌ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నాలుగు టీమ్‌లతోపాటు.. రంగారెడ్డి డివిజన్‌లో 14 మందికి, హైదరాబాద్ డివిజన్ నుంచి ఏడుగురికి, ధూల్‌పేట్‌స్పెషల్ టీమ్‌లో 16 మందికి, ఎస్‌టీఎఫ్ టీమ్‌లోని వివిధ భాగాల్లో 61 మందికి రివార్డులు అందించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ ఖురేషి, హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ కేఏటీ శాస్త్రీ, జాయింట్ కమిషనర్ ప్రణవీ, అనిల్‌కుమార్ రెడ్డి ఏ,బీ టీమ్‌ల ఎక్సైజ్ సూపరిండెంట్ నంద్యాల అంజి రెడ్డి, ప్రదీప్‌రావు, డీఎస్పీ తిరుపతి యాదవ్, ఏఈఎస్ జీవన్‌కిరణ్, సీఐలు, ఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ఉన్నారు.









కాశీవిశ్వనాథుడిని దర్శించుకున్న స్పీకర్ ప్రసాద్ కుమార్

కుంభమేళాలో స్పీకర్ పుణ్యస్నానాలు

వికారాబాద్/పరిగి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహిస్తున్న మహాకుంభమేళాలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ పాల్గొని త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి కాశీవిశ్వనాథ, విశాలాక్షి, కాలభైరవ ఆలయాలను దర్శించుకున్నారు. అలాగే పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తన అనుచరులతోకలిసి త్రివేణిసంగమంలో స్నానాలు ఆచరించారు. అనంతరం అయోధ్యలో బాలరాముడిని దర్శించుకున్నారు.

భద్రేశ్వరుడిని దర్శించుకున్న స్పీకర్ సోదరీమణులు

తాండూరు: పట్టణంలోని భద్రేశ్వర ఆలయంలో శ్రీ బావిగి భద్రేశ్వర స్వామిని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ సోదరీమణులు శోభ, వీణా, ప్రియా, బావరాధాకృష్ణ దర్శించుకున్నారు. శనివారం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలని డీఎం అండ్ హెచ్‌వో ఉమాగౌరి సిబ్బందికి సూచించారు. మండలంలోని శ్రీరంగవరం గ్రామ పీహెచ్‌సీ సెంటర్‌ను ఆమె శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పని తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఇన్, ఔట్ పేషంట్ల రిజిష్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రతిభ, పీహెచ్‌వో ఉషారాణి, పీహెచ్‌ఎన్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.





విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి

మర్పల్లి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకో వాలని జిల్లా ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి అన్నారు. శనివారం బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా ఆమె మర్పల్లి ఎస్టీ హాస్టల్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు మనోధైర్యంతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చన్నారు. బహుమతులు రాని విద్యార్థులు నిరుత్సాహం చెందకుండా పోటీల్లో ఎలా ప్రతిభ చూపాలో నేర్చు కోవాలన్నారు. గ్రామీణ స్థాయికే పరిమితం కాకుండా జిల్లా, రాష్ట్ర జాతీయస్థాయిల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చాలన్నారు. బాలల హక్కుల కోసం ఎన్నో చట్టాలున్నాయని, వాటిపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రిజ్వానా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింగ్‌రావు, టీచర్లు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో ఉపయోగం

కోట్‌పల్లి: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి అన్నారు. మండలం పరిధి ఎన్నారం ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కింద ఎన్నారం ప్రాథమిక పాఠశాల ఎంపికైందని తెలిపారు. ఎఫ్ఎల్ఎన్ విద్యార్థుల సామర్థ్యాలను, విద్యార్థులతో చదివించారు. పాఠశాలకు ఐదు కంప్యూటర్ల ను మంజూరు చేయడం జరిగిందన్నారు. అనంతరం అం గన్వాడీ సెంటర్‌ను పరిశీలించారు. అంతకుముందు కోట్‌పల్లిలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో ఎంఈవో చంద్రప్ప, ఎంపీవో అనంతరాజిరెడ్డి, కేజీబీవీ ప్రత్యేక అధికారి పల్లవి, టీచర్ శేఖర్, సీఆర్పీలు నర్సిములు, లావణ్య మహేశ్వరి, హర్షియ తదితరులు ఉన్నారు.

బాలికలు ఆత్మవిశ్వాసంతో నిలబడాలి

ధారూరు: విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో ఎదగాలని అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి అన్నారు. కేజీబీవీలో నియోజకవర్గస్థాయి విద్యార్థినులకు నిర్వహించిన కబడ్డీ, ఖోఖో పోటీలను ఆమె ప్రారంభించి, విజేతలకు బహుమతులు అందజేశారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు తమ హక్కులను తెలుసుకొని సాధించుకోవాలన్నారు. బాలికలను క్రీడల్లో, విద్యలో ప్రోత్సహించాలని టీచర్లకు సూచించారు. గెలుపొందిన విద్యార్థినిలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా కేజీబీవీల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సమగ్ర కులగణన సర్వేలో భాగస్వాములవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి

కీసర రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కులగణన సర్వేలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి అన్నారు. కులగణన సర్వేపై శనివారం నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయాల్లో అధికారులు, ఎన్యుమరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వేను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ఈ నెల 28 వరకు సర్వే కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి ఝాన్సీ, దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణి, నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ మేనేజర్లు చంద్రశేఖర్, వెంకటేశం, నాగారం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, పొట్ట శ్రీశైలం, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మ్యూజియం అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం



పురాతన కట్టడాలను పరిశీలిస్తున్న గంగాదేవి

కీసర,ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కీసరగుట్టలోని మూతబడిన మ్యూజియం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ పురావస్తు శాఖ అసిస్టెంట్ టెక్నికల్ డైరెక్టర్ గంగాదేవి అన్నారు. ఈ మేరకు శనివారం కీసరగుట్టలోని పురావస్తు శాఖ అధ్వర్యంలో ఉన్న మ్యూజియాన్ని, విష్ణుకుండీలు నిర్మించిన కట్టడాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కీసరగుట్ట చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకు పురావస్తు శాఖ సిద్ధంగా ఉందన్నారు. ఈ మేరకు మ్యూజియం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, ఇక్కడి పరిస్థితులపై ఉన్నత అధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.

బ్రహ్మోత్సవాలకు లక్ష్మీవేంకటేశ్వరాలయం ముస్తాబు



చేవెళ్లలోని బాలాజీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ముఖ ద్వారం, ఆలయంలోని స్వామివారు

చేవెళ్ల ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని చేవెళ్ల శ్రీ బాలాజీ లక్ష్మీవేంకటేశ్వర ఆలయం ముస్తాబైంది. ఈ నెల 26 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగనున్నాయి. ఇందుకోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. 26న ఉదయం అభిషేకం, అర్చన, సాయంత్రం 4గంటలకు లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం, తీర్థ ప్రసాదాలు నివేదన ఉంటుందని ఆలయ మేనేజర్ (ఈవో) నరేందర్, ధర్మకర్త దేవుని వామనాచార్యులు శనివారం తెలిపారు. 27న అభిషేకం, అర్చనలు, రాత్రి స్వామి దీపోత్సవం, అశ్వవాహన సేవ ఉంటాయని వివరించారు. మార్చి 4న అఖండ హారతి, పూజా కార్యక్రమాలుంటాయని పేర్కొన్నారు. ఈ ఉత్సవాలకు భక్తులు, పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారి తీర్థప్రసాదలను స్వీకరించాలని కోరారు.

కండెన్స్‌డ్ బయోగ్యాస్‌కు ప్రోత్సాహం

● ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామిగుప్తా



సదస్సులో బుక్ ఆఫ్ అబ్‌స్ట్రాక్ట్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

ఆదిభట్ల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కండెన్స్‌డ్ బయోగ్యాస్ ఆధారిత శక్తి ఉత్పాదక కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహిస్తోందని ఐఐఐటీ ఆర్.కే.వ్యాలీ డైరెక్టర్, ప్రొఫెసర్ ఏవీఎస్ఎస్ కుమారస్వామి గుప్తా అన్నారు. మంగల్‌పల్లిలోని సీవీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో రెన్యూవబుల్ ఎనర్జీ, గ్రీన్ కంప్యూటరింగ్, సస్టెయినబుల్ డెవలెమెంట్ అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పునరుత్పాదక రంగానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వినియోగించి కాలుష్య రహిత భారతదేశంగా మార్చేందుకు విద్యార్థులు కృషిచేయాలన్నారు. సాంకేతికరంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. ఈ సమ్మేళనంలో బుక్ ఆఫ్ అబ్‌స్ట్రాక్స్ ప్రొసీడింగ్స్‌ని ఆవిష్కరించారు. సదస్సుకు 350 పేపర్లు రాగా అందులో 140 పేపర్లను ఎంపికచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో తెలంగాణ నుంచి 71 పేపర్లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కాసాని రామ్మోహన్‌రెడ్డి, అకాడమిక్ డీన్ నయనతార, వైస్ ప్రిన్సిపాల్ శివారెడ్డి, డీన్ ప్రొఫెసర్ లాల్‌కిషోర్, డాక్టర్ శ్రీలక్ష్మి, లోకేశ్వర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద ప్లాస్టిక్‌ను నిషేధిస్తాం



సదస్సులో పాల్గొన్న ఆలయ కమిటీ చైర్మన్ మహిపాల్‌రెడ్డి

కులకచర్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పాంబండ ఆలయం వద్ద ప్లాస్టిక్‌ను నిషేధిస్తామని ఆలయ చైర్మన్ కోట్ల మహిపాల్‌రెడ్డి తెలిపారు. జీవమిత్ర ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. శివరాత్రి సందర్భంగా త్వరలో జరిగే జాతర ఉత్సవాల్లో పూర్తిగా ప్లాస్టిక్ కవర్లను నిషేధిస్తామని తెలిపారు. బయోడిగ్రీ ఆర్గానిక్ కవర్లు ఉపయోగించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోలు బాలనర్సయ్య, నరేందర్, అర్చకులు పాండు శర్మ, జీవమిత్ర ఆర్గనైజేషన్ నిర్వాహకులు సాయి భరత్‌కుమార్‌గౌడ్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చరిత్రకు నిలువెత్తు సాక్ష్యాలు

(5వ పేజీ తరువాయి)



రామలింగేశ్వరస్వామి ఆలయం

చేపట్టి దాదాపు 400 సంవత్సరాలు పైబడుతున్న మసీదు చెక్కు చెదరకుండా ఉంది. ఈ మసీదు నమూనాతో నగరంలోని పలు చోట్ల ఖుతుబ్ షాహీ నవాబులు మసీదులు నిర్మించారు. ఎత్తయిన స్థలంలో నాలుగు దిక్కుల విశాలమైన స్థలం వదుతూ ముందు పైన ముందు భాగంలో పెద్ద మినార్లు, వెనుక భాగంలో చిన్న పాటి మినార్‌లతో నిర్మించిన ఈ మసీదు నేటికీ చూపరులను ఆకట్టుకుంటోంది. పూర్వ మేడ్చల్ పట్టణానికి చేరుకునే వారికి కిలోమీటర్ల దూరం నంచే ఈ మసీదు ముందు భాగంలో నిర్మించిన మినార్లు కనబడతాయి. మసీదు మినారుల ఆధారంగా దూరం నుంచే ప్రయాణికులు తాము వెళ్లాల్సిన మార్గాన్ని తెలుకునే వారు. దీంతో మసీదును స్థానికులు తమ గ్రామ చరిత్రను చాటే చిహ్నంగా పేర్కొంటారు.

రాతి కట్టడాలతో బురుజులు



డబిల్‌పూర్‌లో బురుజు

పూర్వం గ్రామంలో కొత్త వారు ప్రవేశించకుండా గ్రామ సరిహద్దుల్లో రాతి బురుజులు నిర్మించారు. మేడ్చల్ మండలం డబిల్‌పూర్, నూతన్‌కల్, బండమాధారం గ్రామాల్లో నేటికీ బురుజులున్నాయి. వందల ఏళ్ల క్రితం గ్రామ రక్షణ కోసం పెద్దబండరాళ్లు పేర్చి నిర్మించిన బురుజులు ధృడంగా ఉన్నాయి. గ్రామాల్లో ప్రవేశించే వారి కోసం గ్రామ శివార్లలో ఒక బురుజు, రాత్రి వేళ దొంగతనాలను అరికట్టేందుకు గ్రామ నడిబొడ్డున మరో బుర్జు కట్టి వాటిల్లో రక్షకభటులను ఉంచేవారు. బండమాధారంలో 300ఏళ్ల నాటి బురుజు నేటికీ కొత్తగానే ఉంది. ఈ బురుజుకు మధ్యన వేంకటేశ్వరస్వామి, ఆంజనేయ స్వామి ఆలయాలను నిర్మించి యేటా జాతర నిర్వహిస్తున్నారు. జాతీయ పర్వదినాలప్పుడు వాటిపై జాతీయ జెండాను ఆవిష్కిస్తారు. తరాలు మారినా... మారని పూరాతన కట్టడాలను స్థానికులు పూర్వీకుల ఆస్తిగా భావించటం గమనార్హం.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి రూ.13కోట్లు



సబ్‌స్టేషన్‌కు స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):కల్వకుర్తి నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రూ.13కోట్లు మంజూరు చేసిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మంజూరైన నిధులతో అవసరమైన చోట విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామంలో శనివారం ఎమ్మెల్యే పర్యటించారు. విద్యుత్ ఉప కేంద్రం ఏర్పాటుకు సర్వే నంబర్ 256లో స్థల పరిశీలన చేశారు. గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన జంగమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వేసవి నేపథ్యంలో పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఏడు సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. ప్రతి మండలంలో ఒక సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జున, ఎంపీడీవో శ్రీకాంత్, నాయకులు అజీం, వెంకట్‌రెడ్డి, రఘురాములు, ఆరీఫ్, డేవిడ్, ప్రభాకర్‌రెడ్డి, రవీందర్ యాదవ్, ఎస్సై శ్రీకాంత్ ఉన్నారు.

చదువులో రాణిస్తేనే భవిష్యత్తు



విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లను పంపిణీ చేస్తున్న మధుసూదన్‌రెడ్డి

షాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):చదువులో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని సర్దార్‌నగర్, మన్‌మర్రి, రేగడిదోస్వాడ, తాళ్లపల్లి, హైతాబాద్, పోత్‌గల్, షాబాద్‌లోని బాలుర, బాలికల, కేజీబీవీ, మోడల్‌స్కూల్ పాఠశాలతోపాటు పలు ప్రైవేట్ స్కూళ్లలో 860 మంది విద్యార్థులకు శనివారం ఏఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చైర్మన్ అభిరామ్‌రెడ్డితో కలిసి పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, కంపాక్స్‌లు, ఇతర స్టేషనరీ వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కావలి చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీలు చెన్నయ్య, అశోక్, మాజీ సర్పంచ్‌లు రవీందర్‌నాయక్, నర్సింహులు, నాయకులు శ్రీనివాస్, శేఖర్, జంగయ్య, అంజనేయులు, థౌసిఫ్, రఫీక్, దయాకర్, సూర్య పాల్గొన్నారు.

ప్రజాపాలనకు ఆకర్శితులై కాంగ్రెస్‌లో చేరికలు : కేఎల్లార్



బీజేపీ, బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ కండువాలు కప్పుతున్న కె.లక్ష్మారెడ్డి

మహేశ్వరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):ప్రజాపాలనకు ఆకర్శితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని, మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింతబలోపేతం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం సిరిగిరిపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నర్సింహాగౌడ్ ఆధ్వర్యంలో తుక్కుగూడలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి లక్ష్మారెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కష్టపడే కార్యకర్తలను కాంగ్రెస్ మరిచిపోదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. పదేళ్లపాటు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నేతలను ఇబ్బందులకు గురిచేశారన్నారు. కాంగ్రెస్‌కు పూర్వవైభవం తేవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజునాయక్, మల్లేష్, వెంకటేష్, బాల్‌రాజ్, శ్రీను,మహేందర్,రాఘవేందర్, గణేష్, శ్యామ్, సోమేష్, శ్రీను, కొమురయ్య, హరీష్, పవన్ పాల్గొన్నారు.

అనుమతిలేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



తాండూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేని పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ అన్నారు. శనివారం ఎంఈవో వెంకటయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. అనుమతులేని, అధిక ఫీజులు వసూలు చేస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న పి.శ్రీనివాస్

ఫ్యూచర్ సిటీకి సహకరించాలి



మాట్లాడుతున్న భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు, ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫోర్త్‌సిటీ, ఫ్యూచర్‌సిటీ వరకు 330ఫీట్ల వెడల్పుతో నిర్మించనున్న రోడ్డు పనులకు రైతులు సహకరించాలని, రోడ్డుకు భూములు కోల్పోయే రైతులకు పరిహారం ఇచ్చాకే పనులు ప్రారంభిస్తామని భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు, ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం తిమ్మాపురం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మహేశ్వరం మండలం రావిరాల ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ 13 నుంచి మండలంలోని మీర్కాన్‌పేట రెవెన్యూ బేగరికంచ వరకు మొదటి విడతలో 330ఫీట్ల వెడల్పుతో రోడ్డు వేయడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. రోడ్డుకు భూములు కోల్పోయే రైతుల్లో కొందరు ఇటీవల ఇచ్చిన అభ్యంతరాలపై తిమ్మాపురం రైతులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో కొందరు రైతులు బహిరంగ మార్కెట్ ధరతో పరిహారం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ యాదగిరి, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై దుకాణాలు ఏర్పాటు చేయొద్దు

● రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ



రోడ్డు పక్కన మెస్ నిర్వహిస్తున్న వారితో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై ఇష్టానుసారం దుకాణాలు, వాహనాలను పార్క్ చేస్తే కఠిన చర్యలు తప్పవని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ హెచ్చరించారు. శనివారం ఆయన మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజామొయిజుద్దీన్‌తో కలిసి అజీజ్‌నగర్ పాత చౌరస్తా నుంచి అజీజ్‌నగర్ చౌరస్తా, హిమాయత్‌నగర్ చౌరస్తా, అమ్డాపూర్ చౌరస్తా వరకు జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన దుకాణాల నిర్వాహకులతో మాట్లాడారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కల్గించొద్దని చెప్పారు. రోడ్డుకు అనుకొని దుకాణాలను ఏర్పాటు ప్రమాదాల జరుగుతాయని, అలాంటి వారిపై చర్యలు తప్పవన్నారు. మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ... రోడ్డు పక్కన చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ట్రాఫిక్ సీఐ రాజేందర్ గౌడ్, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి



విద్యార్థులను అభినందిస్తున్న లక్ష్మణ్

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు కృషిచేయాలని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ కౌన్సిలర్ లక్ష్మణ్ అన్నారు. చంద్రాయన్‌పల్లి కేజీబీవీలో బాలల హక్కులపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, అపర్ణ, భ్రమరాంభ, నూర్జాహ, పార్వతీ పాల్గొన్నారు.

విదేశీ విద్యకు ప్రోత్సాహం!



(5వ పేజీ తరువాయి)

సంబంధించి విదేశీ విద్యను అభ్యసించేందుకు ప్రతిపాదించగా, అందులో 12 మందికి రూ.3.40కోట్లు మంజూరు కాగా అన్ని నిధులను ఖర్చు చేశారు. ఈ సారి 42 మంది విద్యార్థులకు సంబంధించి ప్రతిపాదించగా, 10 మంది విద్యార్థులు విదేశాల్లో చదువుకునేందుకు ఆర్థిక సాయం అందించేందుకు రూ.1.72 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధుల్లో ఇప్పటి వరకు రూ.1.20కోట్లు ఖర్చు పెట్టారు. మరికొందరు విద్యార్థులను ఎంపిక చేసే ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు.

టాప్‌లో మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా..

ఈ పథకం అమలులో మేడ్చల్-మల్కాజిగిరి పరుగులు తీస్తోంది. రెండు పర్యాయాలుగా ఉన్నత స్థానంలో నిలుస్తోంది. ఈ సారి కూడా టాప్‌లో నిలిచింది. గత సంవత్సరం మేడ్చల్ జిల్లాలో 64 మంది విద్యార్థులు విదేశీ విద్య రుణం కోసం దరఖాస్తు చేసుకోగా 29 మంది అర్హత సాధించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 53 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, ప్రస్తుతం అధికారులు దరఖాస్తులను పరిశీలిస్తుంది. అందులో దాదాపు 25 మంది విద్యార్థులు అర్హత సాధించే అవకాశం ఉందని అధికారులు తెలుపుతున్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను మెరిట్ ద్వారానే అధికారులు ఎంపిక చేస్తారు. 78.4 శాతాన్ని అధికారులు కటాఫ్‌గా నిర్ణయించారు.

రూ.20లక్షల వరకు ఆర్థిక సాయం

నేడు ఎంతోమంది విద్యార్థులు స్వదేశంలో డిగ్రీ పూర్తిచేసి ఉన్నత విద్య కోసం అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా తదితర దేశాలకు తరలిపోతున్నారు. విదేశాలలో పీజీ చేయాలనుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థినీ విద్యార్థులకు అంబేడ్కర్ ఓవర్సీస్ ఇండియా నిధి పథకం కింద ఆర్థిక సాయం అందించి ప్రోత్సహిస్తున్నారు. రెండు దశల్లో రూ.20లక్షల ఆర్థికసాయం బ్యాంక్‌ల ద్వారా అందిస్తున్నారు. వీసా ఫీజు, ఎయిర్ టికెట్ ఖర్చులు రూ.50వేల వరకు ప్రభుత్వమే చెల్లిస్తుంది. యేటా తెలంగాణ రాష్ట్రం నుంచి ఈ పథకం ద్వారా 220 మంది విద్యార్థులు విదేశీ విద్యకు అర్హత సాధిస్తున్నారు.

సంవత్సరం	విద్యార్థుల ప్రతిపాదనలు	మంజూరైన విద్యార్థుల సంఖ్య	విడుదలైన నిధులు(రూ.కోట్లు)	ఖర్చు (రూ.కోట్లు)
రంగారెడ్డి జిల్లా				
2023-24	28	12	3.40	3.40
2025-26	42	10	1.72 కోట్లు	1.22
మేడ్చల్				
2023-24	69	29	5.80	5.80
2025-26	52	25	5	5
వికారాబాద్				
2023-24	07	ప్రాసెస్‌లో	0	0
2025-26	05	ప్రాసెస్‌లో	0	0

మేడ్చల్ జిల్లాలో ఈ ఏడాది 25 మందికి చాన్స్

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో గతేడాది రెండు దశల్లో కలిపి 29 మందికి విదేశాల్లో విద్యనభ్యసించేందుకు ఆర్థిక సాయం లభించింది. అదేవిధంగా ఈ ఏడాది ఇప్పటి వరకు 52 మంది దరఖాస్తు చే సుకోగా, అందులో దాదాపు 25 మందికి అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. దరఖాస్తుదారులను క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ప్రభుత్వానికి ని వేదించేందుకు ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారులు విచారణ జరుపుతున్నారు.

దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది

విదేశీ విద్యకు ఆర్థికసాయం అందించడంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంది. ప్రస్తుతం దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది. 52 దరఖాస్తుల రాగా, వాటిల్లో దాదాపు 25మందికి అవకాశం ఉంటుంది. విదేశీ విద్యకు వెళ్లిన విద్యార్థులు అక్కడి నుం చి కూడా మమ్ములను సంప్రదిస్తున్నారు.

- జి.వినోద్, మేడ్చల్ జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు కీసరగుట్ట ముస్తాబు


స్వామివారి దర్శనం కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు

(ఐదో పేజీ తరువాయి)

పర్యవేక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. క్షేత్రంపై మద్యపాన నిషేధానికి ఎక్సైజ్ శాఖ అధికారులు కీసరగుట్టలో మొత్తం ఐదు క్యాంప్‌లను ఏర్పాటు చేశారు. మంచి నీటి సరఫరా కోసం జాతర రోజుల్లో 30లక్షల లీటర్ల నీటిని పంపిణీ చేసేందుకు, అవసరమైతే పెంచేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మరుగుదొడ్ల నిర్వహణకు నీటి సరఫరా మెరుగ్గా జరిగేలా పైపులైన్లు వేస్తున్నారు. విద్యుత్ సరఫరాకు 9 ట్రాన్స్‌ఫార్మర్లు, రెండు జనరేటర్లు ఏర్పాట్లు చేస్తున్నారు. దాదాపు 2వేల మంది పారిశుధ్య సిబ్బంది బ్రహ్మోత్సవాల్లో విధులు నిర్వహిస్తారు. విద్యార్థులకు నిర్వహించే క్రీడా పోటీలకు ఇప్పటికే టీంలను ఎంపిక చేశారు. బ్రహ్మోత్సవాల మొదటి రోజు నుంచి ఆటల పోటీలు నిర్వహించేం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆరు రోజులు జరిగే బ్రహ్మోత్సవాల్లో ఉన్నతాధికారులు, అధికారులు, భక్తులు, కార్మికులు, ఉపాధి పొందే వ్యాపారులు ఇలా లక్షల మందికి భోజన ఏర్పాట్లకు ఆలయ నిర్వాహకులు, ఆర్యవైశ్య, రెడ్డి, రజక, వంశ్‌రాజ్, మున్నూరు కాపు తదితర కుల సంఘాల ఆధ్వర్యంలో అన్నదానాలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇలా బ్రహ్మోత్సవాల్లో ఆలయ నిర్వాహకులు, అధికారులు, కుల సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు అందరూ సమన్వయంతో పనిచేస్తూ జాతరను విజయవంతం చేసేందుకు కృషిచేస్తున్నారు.

తెరపైకి విజిలెన్స్ కేసు!

- బల్దియా అధికారుల్లో దడ
- ముగ్గురు అధికారులపై వేటు?
- అక్రమాలపై నలుగురు ఫిర్యాదు


తాండూరు మున్సిపల్ భవనం

తాండూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తాండూరులో బల్దియా అక్రమాలపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టడం చర్చనీయాంశమైంది. మున్సిపాలిటీ భవన నిర్మాణం, అభివృద్ధి పనులకు సంబంధించి జరిగిన అక్రమాలపై విజిలెన్స్ అధికారులు సీరియస్‌గా విచారణ చేపట్టారు. 2020లో తాండూరు మున్సిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు వరాల శ్రీనివాస్‌రెడ్డి, సోమశేఖర్, ప్రభాకర్‌గౌడ్, ఆసిఫ్‌లు కలిసి అప్పట్లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులతో పాటు విజిలెన్స్ శాఖను ఆశ్రయించిన విషయం విధితమే. ఈ మేరకు అధికారులు దాదాపు 10గంటల పాటు లోతుగా రికార్డులను పరిశీలిస్తూ విచారణ కొనసాగించారు. రాష్ట్ర విజిలెన్స్ అధికారుల బృందం శుక్రవారం రాత్రి వరకు ఎంబీలు పట్టుకొని ఇంచు ఇంచు కొలతలు తీస్తూ విచారణ చేపట్టారు. దీంతో ఏమవుతుందోననే అధికారుల్లో అలజడి మొదలైంది. ఈ కేసులో ఇద్దరు ఇంజనీరింగ్ విభాగం అధికారులతో పాటు ఒక ఉన్నతాధికారి మెడకు చుట్టుకుందన్న చర్చ కొనసాగుతోంది. ఈ ముగ్గురు అధికారులపై వేటు తప్పదని తెలుస్తోంది. అధికారులతో పాటు అప్పటి చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్ గుప్తా, కమిషనర్ కె.శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యూనిస్‌లతో పాటు ప్రస్తుతం కొనసాగుతున్న ఏఈ ఖాజా హుస్సేన్‌పై కౌన్సిలర్లు ఫిర్యాదు చేశారు. భారీఎత్తున రూ. 45 లక్షలు, రూ. 3.40కోట్లు భవన నిర్మాణం పేరిట ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. మిషన్ 90డేస్ పేరిట రూ.6.67 లక్షలు వృథాగా ఖర్చు చేశారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఈ మేరకు 5వ వార్డులోని సీసీరోడ్డు, ఇంద్రానగర్‌లోని మురుగు కాల్వలను విజిలెన్స్ అధికారులు తనిఖీ చేసి కొలతలు తీసుకున్నారు. కోట్ల రూపాయల నిధుల దుర్వినియోగం చేశారని 2020లో చేసిన ఫిర్యాదుకు అధికారులు స్పందించి ఐదేళ్ల తర్వాత విచారణను చేపట్టారు. కేసు తెరపైకి రావడంతో అధికారులు కంగుతిన్నారు. ఎవరిపై వేటు పడుతుందోనని అధికారుల్లో భయం పట్టుకుంది.


హాల్ కొలతలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు(ఫైల్)

న్యాయం నిలబడుతుంది



ప్రజాధనం దుర్వినియోగం కాకుండా మేము పోరాటం చేశాం. మాది న్యాయమైన పోరాటం అయినందునే విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలతో అధికారుల్లో భయం మొదలైంది. అధికారులతో పాటు అప్పట్లో సహకరించిన ప్రజాప్రతినిధులనూ ఈ కేసులో భాగస్వాములను చేయాలి. దుర్వినియోగమైన నిధులను అధికారులు అప్పటి ప్రజాప్రతినిధి నుంచి రికవరీ చేసే వరకు వదలం. 11అంశాలపై మేము ఫిర్యాదు చేశాం. ఇంకా చాలా అంశాలపై విచారణ చేపట్టాల్సి ఉంది. నాతో పాటు మరో ముగ్గురు కౌన్సిలర్లు ఈ పోరాటంలో భాగమయ్యారు.

- వరాల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్

క్రైం కార్నర్

బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడి రిమాండ్

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బాలికను లైంగిక దాడికి పాల్పడిన యువకుడిని మేడ్చల్ పోలీసులు అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని డబీల్‌పూర్ గ్రామానికి చెందిన అఖిల్(21), ఓ గ్రామానికి చెందిన 17ఏళ్ల బాలిక ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతున్నారు. అఖిల్ కొద్ది రోజులుగా సదరు బాలికను ప్రేమపేరుతో వెంటాడి వేధించసాగాడు. ఇదేక్రమంలో బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బాలిక కుటుంబసభ్యులు మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అఖిల్‌ను అరెస్టు చేసి పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

గడ్డివాము దగ్ధం


మంటలను ఆర్పుతున్న ఫైర్‌సిబ్బంది

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గడ్డివాము దగ్ధమైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధి ఎదులాబాద్‌లో శనివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఏదులాబాద్ గ్రామానికి చెందిన బింగి వెంకటేష్‌గౌడ్, జెనిగె లింగంయాదవ్‌లకు చెందిన రెండు గడ్డివాములు పాతకోటలో పక్కపక్కనే ఉన్నాయి. మధ్యాహ్నం ఒక్కసారిగా గడ్డివాములకు నిప్పంటుకొని మంటలు వ్యాపించాయి. స్థానికులు గమనించి పోలీసులకు, ఫైర్‌సిబ్బందికి సమాచారం అందించారు. అప్పటికే మంటలు ఎగసిపడటంతో ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకురావడానికి ఇబ్బందిపడ్డారు. వెయ్యి కట్టల పశుగ్రాసం దగ్ధమైందని వెంకటేష్, లింగంలు వాపోయారు. వేసవి వస్తున్నందున పశువులకు మేతగా వేయడానికి గడ్డివాములను ఏర్పాటు చేశామని తెలిపారు. దాదాపు లక్షా 40వేల విలువచేసే పశుగ్రాసం బూడిదైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరైనా గడ్డివాములకు నిప్పు పెట్టారా? లేదా ప్రమాదవశాత్తు జరిగిందా? అనే విషయం తెలియాల్సి ఉంది.

పశువులను కబేళాలకు తరలిస్తున్న ఇద్దరిపై కేసు


పట్టుబడిన పశువులను తరలిస్తున్న డీసీఎం

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): డీసీఎం వ్యాన్‌లో క్రూరంగా పశువులను కబేళాలకు తరలిస్తున్న ఇద్దరిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదుచేశారు. సీఐ పందిరి పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడ్‌మెట్‌కు చెందిన దావుత్‌పాషా), నరేష్‌లు భువనగిరి నుంచి నగరంలోని కబేళాకు డీసీఎం వ్యాన్‌లో పశువులను తరలిస్తున్నారు. శనివారం ఉదయం యంనంపేట్ చౌరస్తాలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదస్థితిలో వస్తున్న డీసీఎంను ఆపి సోదాచేయగా గాలి, నీరు, ఆహారం అందించకుండా పశువులను తరలిస్తున్నట్లు గుర్తించారు. 20పశువులను స్వాధీనం చేసుకొని నగరంలోని గోశాలకు తరలించారు. పశువులను తరలిస్తున్న దావుత్ పాషా, నరేష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

మర్పల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్లాపూర్ గ్రామంలో బాలికకు వివాహం చేస్తున్నారని అందిన సమాచారం మేరకు అధికారులు గ్రామానికి చేరుకుని వివాహాన్ని అడ్డుకున్నారు. పోలీసులు, అంగన్‌వాడీ సిబ్బంది గ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. అనంతరం బాలికను వికారాబాద్‌లోని బాల సంరక్షణ కేంద్రానికి తరలించినట్లు అధికారులు తెలిపారు.

లింక్ నొక్కి డబ్బులు పోగొట్టుకున్న విద్యార్థి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఓ ఇంజనీరింగు విద్యార్థి ఇన్వెస్ట్‌మెంట్ కోసం వచ్చిన లింక్‌ను నొక్కి డబ్బులు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్ర లాతూర్‌కు చెందిన సదాశివ్ సంజీవ్ పోచారం మున్సిపాలిటీ, జోడిమెట్లలో అద్దెకు ఉంటూ అనురాగ్ యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్నాడు. గతేడాది డిసెంబర్ మాసంలో టెలిగ్రాం ద్వారా ట్రేడింగ్ యాప్‌లో ఇన్వెస్ట్‌మెంట్ కోసం ప్రయత్నించాడు. గుర్తుతెలియని నెంబర్ నుంచి వచ్చిన లింక్‌ను నొక్కాడు. యాప్‌లో వచ్చిన వివరాలను నింపాడు. సదరు వ్యక్తులు ముందు మీరు డబ్బులు పంపించాలని సమాచారం ఇవ్వడంతో సదాశివ్ సంజీవ్ పలుమార్లు రూ.64వేలను ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. అనంతరం ఇన్వెస్ట్‌మెంట్ డబ్బులు తిరిగి రాలేదని తెలుసుకొని సదరు ఫోన్‌నెంబర్‌ను సంప్రదించగా అది పనిచేయకపోవడంతో మోసపోయానని గమనించి శనివారం పోచారం ఐటీ పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బహిరంగంగా మద్యం తాగుతున్న 14మందిపై కేసు

మూడుచింతలపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జీనోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం బహిరంగంగా మద్యం తాగుతున్న 14మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. మండలంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో ఓపెన్ వెంచర్స్‌లో మద్యం సేవిస్తుండగా 14మందిని పట్టుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా రాజీవ్ రహదారిపై అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న రంగీలా దాబా, రాయల్‌దాబా, క్లాసిక్ దాబాలపై కేసు నమోదు చేశామన్నారు.

పురాతన విగ్రహాలకు భద్రత కల్పించాలి

- ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి వినతి


ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న కంకల్ గ్రామస్తులు

పూడూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పురాతనవిగ్రహాలకు భద్రత కల్పించాలని కంకల్ గ్రామస్తులు ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కోరారు. వారు ఎంపీని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ గ్రామంలో అత్యంత పురాతనమైన వీరభద్రస్వామి ఆలయం ఉన్నదని, అట్టి ఆలయ పరిసరాల్లో సుమారు 60 వరకు విగ్రహాల ఉన్నాయని తెలిపారు. 15రోజుల కిందట పురావస్తుశాఖ పరిశోధకులు ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో శివనాగిరెడ్డి, పరిశోధకులు హరగోపాల్ ఆధ్వర్యంలో పరిశోధన జరిపితే అట్టి ఆలయ నిర్మాణం, విగ్రహాలు కల్యాణ చాళుక్యుల కాలం క్రీ.శ.1129, 1130, 1132 కాలం నాటివిగా గుర్తించినట్లు తెలిపారు. అట్టి అమూల్యమైన సంపద, గ్రామంలో తమ గ్రామంలో ఉందని, అట్టి ఆలయంలోని విగ్రహాలు, శాసనాలను గ్రామంలోనే ఒక మ్యూజియం ఏర్పాటు చేసి అక్కడే ఉంచాలని, కేంద్ర ప్రభుత్వం ద్వారా తగిన గుర్తింపు కలగజేసేలా చూడాలని కోరారు. ఉన్నతాధికారులు, ప్రభుత్వాలతో చర్చించి తమ నిర్ణయానికి సానుకూలంగా స్పందించాలని కోరారు. అందుకు తగిన ఏర్పాట్లు సౌకర్యాలు కల్పించాలని కోరారు.

కార్యకర్తలు సమష్టిగా పని చేయాలి


ఎన్నికైన నాయకులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కార్యకర్తలు సమష్టి కృషితో ముందుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. ఆయన నివాసంలో శనివారం బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ మండలనాయకులతో సమావేశం నిర్వహించారు. మండల ప్రధాన కార్యదర్శిగా శివకుమార్, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా శ్రీను, బీసీ సెల్ అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్, యూత్ ప్రధాన కార్యదర్శిగా ఎర్రవల్లి శ్రీధర్‌రెడ్డి, సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌గౌడ్‌లను నియమించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పురుషోత్తంరెడ్డి, నారేగూడెం మహిపాల్‌రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

శివరాత్రికి ముస్తాబైన ఆలయం


ఆలయం వద్ద ముళ్ల పొదలను తొలగిస్తున్న సిబ్బంది

యాలాల, ఫిబ్రవరి 22, (ఆంధ్రజ్యోతి): ఈనెల 26వ తేదీన మహా శివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. మండలంలోని జుంటుపల్లి రామలింగేశ్వర స్వామి ఆలయం సమీపంలో ముళ్లపొదలను తొలించేందుకు ఆలయ ధర్మకర్తలు ముందుకు వచ్చారు. ఆలయం చుట్టూ పెరిగిన ముళ్ల పొదలను జేసీబీ సాయంతో శనివారం తొలగించారు. శివరాత్రి రోజు రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు.

శామీర్‌పేట కట్టమైసమ్మ ఆలయ చైర్మన్‌గా మ్యాకల మహేందర్


అమ్మవారిని దర్శించుకుంటున్న మహేందర్‌యాదవ్

శామీర్‌పేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట పెద్ద చెరువు కట్టమైసమ్మ ఆలయ పాత కమిటీని రద్దు చేసి నూతన కమిటీని శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎన్నుకున్నారు. ఆలయ నూతన చైర్మన్ మ్యాకల మహేందర్‌యాదవ్ ఎన్నికయ్యారు. ఆయనతో పాటు వైస్ చైర్మన్లుగా వల్లపు ఎల్లం, ఇర్రి వెంకట్‌రెడ్డి, కోశాధికారిగా బోయిని రాజు, ప్రధాన కార్యదర్శిగా బత్తిని రాంచందర్‌గౌడ్, కమిటీ సభ్యులుగా దొంతరబోయిన మహేశ్, నీరుడు మధు, వాసాలమర్రి చిన్న శేఖర్, బట్టు మశ్చందర్, మాదాసు శ్రీకాంత్, పడకంటి వెంకటేశ్‌చారి, కుమ్మరి వెంకటేశ్, బాలేకర్ సాయి, గజ్వేల్లి శ్రీరాములు, బొలుగుల పరమేశ్, సోగడి చిన్న రమశ్‌లను గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆలయ నూతన కమిటీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వేదపండిత బ్రహ్మణులు నూతన కమిటీని సత్కరించారు.

ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలి

వికారాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని వికాస్ జూనియర్ కళాశాల వ్యవస్థాపకుడు, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ అన్నారు. స్థానిక క్లబ్‌మాల్ ఆవరణలో శనివారం వికాస్ జూనియర్ కళాశాల సీనియర్ విద్యార్థులకు, జూనియర్ విద్యార్థులు ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ప్రసంగించారు. అనంతరం విద్యార్థులచే నిర్వహించబడిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

కులకచర్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని కులకచర్ల కేజీబీవీ ప్రిన్సిపాల్ దేవి అన్నారు. కేజీబీవీలో శనివారం బాలికలకు బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య చిత్రలేఖనంపై పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి నిహారిక (8వ తరగతి), ద్వితీయ బహుమతి బింధు (7వ తరగతి), తృతీయ బహుమతి రమాదేవి (8వ తరగతి)కి లభించింది.

విద్యకు ప్రత్యేక ప్రాధాన్యం


వార్షికోత్సవంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తోందని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగిలోని జ్యోతిబాపూలే బాలికల రెసిడెన్షియల్ స్కూల్ వార్షికోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖకు ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయిస్తున్నారని తెలిపారు. రెసిడెన్షియల్ పాఠశాలలు అయితే కార్పొరేట్ కంటే మెరుగైన వసతులు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, తహసీల్దార్ ఆనంద్‌రావు, మాజీ సర్పంచ్ సిద్దాంతి పార్థసారతి, ప్రిన్సిపాల్ హరిత, జి.సౌజన్య, జ్యోతి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాండూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డికి టి.మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధ) ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏసురత్నం, కార్యదర్శి జైపాల్‌రెడ్డిలతో పాటు స్థానిక కార్మిక నాయకులు నర్సింహులు, బి.వెంకటప్ప, జి.అశోక్, జే.గోపాల్‌లు మాట్లాడుతూ పర్మినెంట్ కార్మికులకు 4డీఏలు చెల్లించడంతో పాటు పీఆర్సీలు వెంటనే ప్రకటించాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు ప్రకటించాలని సూచించారు. 60సంవత్సరాలు పైబడిన కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ.5లక్షలు, విధి నిర్వహణలో మరణించిన కార్మిక కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వారు కోరారు.

నేటి నుంచి కంకల్ వీరభద్రేశ్వరస్వామి జాతర

పూడూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కంకల్ వీరభద్రేశ్వరస్వామి జాతర బ్రహ్మోత్సవాలు నేటి(ఆదివారం) నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. నేడు(ఆదివారం) ధ్వజారోహణం 24న గీతాయజ్ఞం, పారాయణం, 25న మృత్యుంజయ హోమం, రుద్రహోమం, 26న మహాశివరాత్రి, రుద్రాభిషేకం, 27న తెల్లవారుజామున అగ్నిగుండం, 28న రథోత్సవం, మార్చి 1వ తేదీన పార్వతిపరమేశ్వరుల కల్యాణం, రాత్రి సేవా, మానసపూజ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. కావున భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను వియవంతం చేయాలని వారు కోరారు

గురుకుల ప్రవేశ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నేడు (ఆదివారం) నిర్వహించనున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రవేశ పరీక్షలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎదులాబాద్‌లోని కైట్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ ఫైన్ ఆర్ట్స్ గురుకుల పాఠశాల ప్రవేశపరీక్షా కేంద్రంలో 152మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నట్లు ప్రిన్సిపాల్ రాము ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రంలోకి 9:30గంటలకే అనుమతిస్తారని, సకాలంలో హాజరుకావాలని కోరారు. ఆధార్‌కార్డు, హాల్‌టికెట్, పెన్, పెన్సిల్‌తో రావాలని కోరారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎదులాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల (మల్కాజ్‌గిరి) ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు.

కులకచర్ల: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో బాలురు, బాలికలు చేరేందుకు మండలంలోని బండవెల్కిచర్ల గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఆదివారం ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు చేసినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రంలో 5 వ తరగతిలో ప్రవేశానికి 260 మంది, 6 నుంచి 9 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీ కోసం 257 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

ఆలయాల్లో వేలం

కులకచర్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బండవెల్కిచర్ల గ్రామ పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం తలనీలాలు పోగు చేసుకునేందుకు వేలం నిర్వహించారు. ఖమ్మంకు చెందిన సజ్జ శ్రీను రూ.2 లక్షలా 85 వేలకు వేలాన్ని దక్కించుకున్నారు. మార్చి 1 నుంచి 2026 ఫిబ్రవరి 28వరకు తలనీలాలు పోగు చేసుకునే అవకాశం ఉంటుంది. ఆలయ చైర్మన్ కోట్ల మహిపాల్, ఏవో బాలనర్సయ్య పాల్గొన్నారు.

కీసర: కీసరగుట్టలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని వసూళ్లు చేసే లైబజార్ వేలం శనివారం నిర్వహించారు. దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణి అధ్వర్యంలో నిర్వహించిన వేలంలో నాగారం గ్రామానికి చెందిన కృష్ణారావు రూ.4లక్షలకు దక్కించుకున్నారు.

త్రీడీ ప్రింటింగ్‌పై శిక్షణ

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శనివారం మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో 'త్రీడీ ప్రింటింగ్'పై ఒక్కరోజు శిక్షణను ఏర్పాటు చేశారు. యూనివర్సిటీలో ఆయా విభాగాలకు చెందిన వంద మంది విద్యార్థులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. త్రీడీ ప్రింటర్ల పనితీరు వాటిని ఉపయోగించి వివిధ ప్రాజెక్టులను విద్యార్థులతో తయారు చేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సికిందర్‌బాబా, మదన్‌మోహన్‌రెడ్డి, జష్‌కుమార్, శ్రీనివాసులు, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

వేరుశనగకు పెరిగిన ధర

ధారూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ధారూరు వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సాయంత్రం నిర్వహించిన బీట్లలో వేరుశనగ ధరలు పెరిగాయి. గత వారం వేరుశనగ క్వింటాలుకు రూ.5,600ల నుంచి రూ.6,670ల వరకు ధర పలకగా ఈ వారం రూ. 5,925ల నుంచి రూ.6,750 వరకు ధర పలికింది. ఈ వారం కందులు క్వింటాలుకు రూ.7,200ల నుంచి రూ.7,520ల వరకు, మొక్కజొన్న క్వింటాలుకు రూ.2,300ల నుంచి రూ.2,390ల వరకు ధర పలికి ఖరీదుదారులు కొనుగోలు చేశారు. కాగా వేరుశనగ 224.7 క్వింటాళ్లు, కందులు 506.5 క్వింటాళ్లు, మొక్కజొన్న 51క్వింటాళ్ల క్రయవిక్రయాలు జరిగాయని మార్కెట్ అధికారి సిద్దమ్మ తెలిపారు.

సంక్షిప్తంగా..

సీసీరోడ్డు పనులు ప్రారంభం

మోమిన్‌పేట్: మొరంగపల్లిలో శనివారం రూ.10 లక్షల ఎంపీ నిధులతో చేపట్టిన సీసీరోడ్డు పనులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోకట్ మాధవరెడ్డి, నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు ప్రారంభించారు.

శ్రీశైల మల్లికార్జున సేవలో తాండూరు భక్త బృందం

తాండూరు: శ్రీశైలంలో సాయి పుత్ర హోమ్స్ అండ్ డెవలపర్స్ అధినేత భావనోళ్ల శంకర్ యాదవ్ చేపట్టిన అన్నదానంలో శనివారం తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, డైరెక్టర్ ఉదయ్ భాస్కర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏ జాబితాలోకి చేర్చాలి

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ కులస్థులను బీసీ డి నుంచి బీసీ ఏ జాబితాలోకి చేర్చాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి కూర వెంకటయ్య అన్నారు. కొడంగల్‌లోని కడా కార్యాలయ సిబ్బంది సుదర్శన్‌కు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తలారిశేఖర్, రాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొడంగల్/మేడ్చల్ టౌన్: కొడంగల్‌లో 33 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మండలంలోని టేకుల్‌కోడ్, రావుల్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ, ఏఈ తెలిపారు. అదేవిధంగా మేడ్చల్‌లోని కిష్టాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో నేడు ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

పాఠశాల విద్యార్థుల విహారయాత్ర

బొంరాస్‌పేట్: జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన 8, 9 తరగతుల విద్యార్థులు శనివారం విహార యాత్రకు బయల్దేరి వెళ్లారు. ప్రత్యేక బస్సులో హైదరాబాద్‌కు వెళ్తున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పఠనం

కొడంగల్: పట్టణ శివారులోని సిద్దనొంపు దగ్గర శనివారం హిందూ వాహిని సభ్యులు, యువకులు హనుమాన్ చాలీసాను పఠించారు. ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.